# ఊరుమ్మడి భూముల్ని కాపాడుకుందాం

**చెరువులు, శ్మశానాలు, కాలువలు, దొరువులు, మరుగుదొడ్లు, బందిలదొడ్లు, దారులు, వంకలు, పాటిమట్టి దిబ్బలు, పశువుల మేత భూములు, బండ్లబాటలు వగైరాలన్నీ ఊరుమ్మడి భూములే.**

ఇంగ్లీషులో వాటిని కామన్స్ అంటారు. తెలుగులో ప్రాంతాన్ని బట్టి గ్రామకంఠం, గ్రామనెత్తం లాంటి పలు పేర్లతో పిలుస్తారు. సులభంగా అర్థమవాలంటే ఊరుమ్మడి భూములనో, పంచాయతీ భూములనో చెప్పొచ్చు. ఆ భూముల స్వభావం ఏమిటో దాని పేరులోనే ఉన్నా తెలియనట్టు నటించే గ్రామ పెత్తందార్లు, అధికారులు, రాజకీయ నాయకులు మన దేశంలో కోకొల్లలు.

చెరువులు, శ్మశానాలు, కాలువలు, దొరువులు, మరుగుదొడ్లు, బందిలదొడ్లు, దారులు, వంకలు, పాటిమట్టి దిబ్బలు, పశువుల మేత భూములు, బండ్ల బాటలు వగైరాలన్నీ ఊరుమ్మడి భూములే. అంటే ఊరందరికీ అవసరమైన భూములు. ఊరందరూ వాడుకునే భూములు. అందుకే వీటిని ఏ ఒక్కరికీ ఇవ్వడానికి లేదు. అవి గ్రామ పంచాయతీకి చెందినవైనప్పటికీ వాటిని అన్యాక్రాంతం చేయడానికి వీల్లేదు. సంరక్షించడం మాత్రమే వాటి పని. ఊర్లో ప్రతి ఒక్కళ్లకూ తెలిసిన ఈ విషయాలు ప్రభుత్వ అధికార్లకు ఎలా తెలియవో మనకు అర్థం కాదు. థర్మల్ ప్రాజెక్టుల పేరు మీద, సెజ్‌ల పేరు మీద అటువంటి వేలాది ఎకరాలను కంపెనీలకు కళ్లు మూసుకుని అప్పగించేయడం చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. ఇటువంటి అక్రమాలపై కొన్ని నెలల క్రితం సుప్రీంకోర్టు ఒక మంచి తీర్పు చెప్పింది. జగ్పాల్‌సింగ్, ఇతరులు వర్సెస్ పంజాబ్ ప్రభుత్వం, ఇతరులు (సివిల్ అప్పీల్ నెం. 1132/2011) అనే కేసులో సుప్రీమ్‌కోర్టు న్యాయమూర్తులు ఇలా అన్నారు.



"దేశంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి చాలా ప్రాంతాల్లో అంగబలం, ధనబలం, రాజకీయ పలుకుబడిని అడ్డంపెట్టుకుని చిత్తశుద్ధి లేని వ్యక్తులు గ్రామీణ సమిష్టి భూములను కబ్జా చేయడాన్ని మనం కళ్లారా చూస్తూనే వున్నాం. చాలా రాష్ట్రాల్లో గ్రామీణుల ఉమ్మడి అవసరాలకు పనికొచ్చే ఇటువంటి స్థలాలు అంగుళం కూడా మిగలలేదు. అవి కాగితాలకే పరిమితం అయ్యాయి. దేశ వ్యాప్తంగా గ్రామాల్లో పెత్తందార్లు ఈ సమిష్టి భూములను పథకం ప్రకారం కబ్జా చేసుకుని వాటి సహజ స్వభావానికి పూర్తి విరుద్ధమైన అవసరాలకు ఉపయోగపెట్టి గ్రామ ప్రజల ప్రయోజనాలను పణంగా పెట్టి వ్యక్తిగత లాభాలార్జిస్తున్నారు. ఇవన్నీ ప్రభుత్వ అధికారులు, గూండాలు, బలమైన స్థానిక దుష్ట శక్తుల అండదండలతోనే జరుగుతున్నాయి".

ఈ మాటలు చదువుతుంటే సోంపేట, కాకరాపల్లి సంఘటనలు, గూండాల చేతుల్లో దెబ్బలు తిన్నవారు, పోలీసు కాల్పుల్లో మరణించిన వారు గుర్తు రావడంలా? కాకినాడ సెజ్‌కోసం పచ్చటి భూములను అక్రమంగా ప్రైవేటు కంపెనీలకు అప్పజెప్పడం గుర్తుకు రావడంలా? ఇవి మనకి తెలిసిన ఊళ్లు, ప్రాంతాలు. మనకు తెలిసిన మనుషులు. రాష్ట్రం దాటితే పాస్కో, జైతాపూర్, నర్మదా... ఎక్కడ జరగడం లేదు ఈ తంతు?

ఊరుమ్మడి అవసరాల కోసం ఉపయోగించే భూములే కాక బంజరు, పోరంబోకు, శ్రోత్రియం, ఇనాం, దేవాలయ భూములు వంటివి కూడా ఊరంతటికీ చెందే భూములే. స్థానికుల జీవనోపాధి కోసం వాటికి పట్టాలు ఇవ్వవచ్చు కాని అవి ఎప్పటికీ అసైన్‌మెంటు భూములే. అమ్ముకోవడానికి గాని అన్యాక్రాంతం చేయడానికి గాని

ఎవరికీ హక్కు ఉండదు. వాటిని సైతం కబ్జాదార్ల రెక్కల నుండి కాపాడటమే ఈ తీర్పు ప్రధాన ఉద్దేశం. అన్ని ఊర్లలో మాదిరిగానే పంజాబ్ రాష్ట్ర పాటియాలా జిల్లా రోహర్ జాగీర్ గ్రామంలో కూడా ఒక చెరువుంది. గ్రామంలోని కాల్వలన్నీ ఈ చెరువులో కలుస్తాయి. గ్రామస్తుల పశువులను కడగడానికి, వాటి దాహం తీర్చడానికి ఈ చెరువు వారికి ఉపయోగపడేది. ఈ చెరువుని కొందరు అక్రమంగా ఆక్రమించుకుని మట్టితో పూడ్చేసి గృహ సముదాయం కట్టడం మొదలెట్టారు. ఆక్రమణలను అడ్డుకుని అక్రమ నిర్మాణాలను తొలగించాల్సింది పోయి పాటియాలా జిల్లా కలెక్టరు ఆక్రమణదారులచే నామమాత్రంగా కొంత రుసుము పంచాయితీకి ముట్టచెప్పించి ఆ కట్టడాలను క్రమబద్ధీకరించడానికి పూనుకున్నారు. ఈ కేసు ఆఖరుకి అప్పీల్ రూపంలో ఇద్దరు సభ్యులు గల సుప్రీంకోర్టు డివిజన్ బెంచ్ ముందుకు వచ్చింది. ఇటువంటి అక్రమాలను క్రమబద్ధీకరించకూడదని, అక్రమ నిర్మాణాలను తొలగించాల్సిందేనని, భూమిని తిరిగి గ్రామ పంచాయితీకి అప్పగించాల్సిందేనని, సుప్రీంకోర్టు ఖచ్చితంగా చెప్పింది. కేవలం కేసు వివరాలకే పరిమితమై తీర్పు ఇచ్చుంటే మేము మీ దృష్టికి ఈ తీర్పుని తీసుకుని వచ్చేవారం కాదేమో. ఈ తీర్పులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఉద్దేశించి అత్యున్నత న్యాయస్థానం కొన్ని ప్రత్యేక ఆదేశాలు జారీ చేసింది, విలువైన కొన్ని సూత్రీకరణలు చేసింది.

సమిష్టి అవసరాలకు ఉపయోగపడే భూములు ప్రభుత్వ ఆధీనంలో వున్నా ఈ భూములపై ప్రజలకు హక్కుంటుందని కోర్టు తేల్చి చెప్పింది. ఎస్టేట్ నిషేధ చట్టాలు వంటి చట్టాల ద్వారా ప్రభుత్వం ఆయా భూములను వశపర్చుకున్నంత మాత్రాన దానర్థం ప్రజలు వాటిపై తమ సమిష్టి హక్కులు కోల్పోతారని కాదని స్పష్టం చేసింది. గ్రామ పంచాయితీ భూములు, పోరంబోకు భూములు, ఉమ్మడి అవసరాలకు ఉపయోగపడే భూములు దుర్వినియోగం కాకుండా ఉండటానికి నిత్యం ప్రభుత్వంతో తలపడే సామాన్యులకు ఈ తీర్పు ఎంత ఉపయోగపడుతుందో ఆలోచించండి. ప్రభుత్వ ఆధీనంలో వున్న భూమిపై ప్రభుత్వానికే సర్వాధికారాలున్నాయి, ప్రశ్నించడానికి మీరెవరు అని దబాయించి నోళ్లు మూయించే ధోరణిని అరికట్టడానికి ఈ తీర్పు పనికొస్తుంది. ఈ భూములపై ప్రజల, గ్రామ సభల అభిప్రాయాలను, అభ్యంతరాలను, ఆకాంక్షలను విస్మరించడానికి వీలు లేదని చెబుతుంది ఈ తీర్పు. ఈ భూములను అంతగా అవసరమైతే ఆయా చట్టాలకు లోబడి నిరుపేదలకు, ఎస్.సి., ఎస్.టి. తరగతుల వారి గృహ నిర్మాణాల కోసం, బడి, ఆస్పత్రి మొదలైన ఉమ్మడి ప్రజావసరాల నిమిత్తం ఉపయోగపెట్టుకోవచ్చు కానీ ఈ విధంగా కబ్జాదార్లు చేసే భూ కైంకర్యాలు ఒప్పుకోవడానికి వీల్లేదని అంది.

అంతే కాదు. ఈ విధంగా అక్రమంగా అన్యాక్రాంతమైన భూముల నుండి ఆక్రమణదారులను తొలగించి వాటిని తిరిగి గ్రామ సభలకు, పంచాయితీలకు అప్పగించి గ్రామస్తుల ఉమ్మడి అవసరాలకు ఉపయోగపడే విధంగా పథకాలు చేపట్టాలని కూడా కోర్టు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులను ఆదేశించింది. అక్రమ ఆక్రమణలు జరిగి చాలాకాలం అయిందనో, ఆ నిర్మాణాలకై భారీ మొత్తం ఖర్చు చేశారనో, వారు రాజకీయ పలుకుబడి గలవారనో కారణం చూపి ఆ చర్యలను మాఫీ చేయడానికి, క్రమబద్ధీకరించడానికి వీలు లేదని కూడా తేల్చి చెప్పింది. క్రమబద్ధీకరించాల్సిన సందర్భాలను కూడా పేర్కొంది. భూమి లేని నిరుపేదలకు లేదా ఎస్.సి., ఎస్.టి. తరగతుల వారికి కౌలుకి ఇచ్చినప్పుడో, అప్పటికే ఆ భూమిపై ఒక బడో, ఆస్పత్రో, ఇతర ప్రజావసరాలకు సంబంధించే పని జరుగుతున్నప్పుడో తప్ప ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ ఆక్రమణలను క్రమబద్ధీకరించడానికి వీలు లేదని చెప్పింది. ఈ విషయంలో గడువులోపు ప్రభుత్వ కార్యదర్శులు విచారణ జరిపి కోర్టుకి నివేదికలు సమర్పించాలని ఆదేశించింది.

గ్రామాల్లో సమిష్టి భూములు దుర్వినియోగం కాకుండా వాటిని భస్మాసుర హస్తాల నుండి కాపాడుకోవడానికి అనునిత్యం సంఘర్షించే ప్రజలు, ప్రజా సంఘాలు, ప్రజా ఉద్యమాలు తమ హక్కులను కాపాడుకునే యత్నంలో తమ వాదనలు మరింత పదును పెట్టుకోవడానికి ఈ తీర్పు ఉపకరిస్తుందని దీన్ని మీ దృష్టికి తీసుకుని వచ్చాం. భూములు ప్రభుత్వానివైనా వాటిని ఉపయోగించే విషయంలో ప్రజలకు మీరు జవాబుదారులే అనే విషయాన్ని అధికారులకు మరోసారి గుర్తుచేద్దాం.

**మానవ హక్కుల వేదిక**

**23-8-2011** **Human Rights Forum (HRF)**

ప్రచురణకర్తలు : ఎస్. జీవన్‌కుమార్ – 98489 86286, వి.ఎస్.కృష్ణ – 94404 11899